క్లుప్తంగా

ఎన్‌సీసీ క్యాడెట్‌లకు మేజర్ భాను చందర్ మెమోరియల్ అవార్డు


అవార్డు అందుకుంటున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

విజయనగరం అర్బన్: మేజర్ భానుచందర్ నారాయణ మెమోరియల్ అవార్డుకు స్థానిక సత్య డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు భాస్కరరావు, పావనిలు ఎంపికయ్యారు. ఈ మేరకు సత్య కళాశాలలో ఆదివారం జరిగిన సన్మాన కార్యక్రమంలో జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి కృష్ణరావు చేతుల మీదుగా వారికి అవార్డు అందజేశారు. కార్యక్రమంలో భాను చందర్ నారాయణ తండ్రి నారాయణ భానుమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయిదేవమణి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల సేకరణ


పుస్తకాలు సేకరిస్తున్న గ్రంథాలయ సేవా సంఘం ప్రతినిధులు

విజయనగరం అర్బన్: గ్రంథాలయాల కోసం జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ప్రతినిధులు నగరంలో పుస్తకాల సేకరణ ఆదివారం చేపట్టారు. ఎస్‌బీఐ ఉద్యోగి కృష్ణరాజేశ్వరి ఆధ్యాత్మిక, ప్రవేశ పరీక్షలు, ఇతిహాసం పుస్తకాలను సంఘ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ఎస్ రాజు పాల్గొన్నారు.

రైతుకు కేంద్రం వెన్నుపోటు

నెల్లిమర్ల: కేంద్ర బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీ తగ్గించి రైతుకు కేంద్రంలోని మోదీ సర్కారు వెన్నుపోటు పొడిచిందని రైతు సంఘం నాయకుడు కిల్లంపల్లి రామారావు విమర్శించారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయానికి పెద్దపీట వేశామని చెప్పి, తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఎరువులకు సంబంధించి, సబ్సిడీ తగ్గించడం దారుణమన్నారు. కార్మిక రంగానికి కూడా బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం జరిగిందన్నారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచి, రైతులను ఆదుకోవాలని కోరారు.

కార్మిక అమరవీరుల వర్ధంతి రేపు

నెల్లిమర్ల: స్థానిక అమర కార్మిక భవనంలో ఈ నెల 4వ తేదీన జ్యూట్ అమర కార్మికుల వర్ధంతి నిర్వహిస్తున్నట్లు ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలసూరి ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. అధిక సంఖ్యలో కార్మికులు హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఆపస్ ఆవిర్భావ దినోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న ఆపస్ రాష్ట్ర కార్యదర్శి రాము నాయుడు తదితరులు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) ఆవిర్భావ దినోత్సవం ఫూల్‌బాగ్‌లోని ఆ సంఘ కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. సంఘ రాష్ట్ర కార్యదర్శి ఇజ్జిరోతు రామునాయుడు తొలుత సంఘ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడమే లక్ష్యంగా సంఘం ఏర్పాటైన దగ్గర నుంచి కృషి చేస్తోందన్నారు. జాతీయవాదం, దేశభక్తి, దేశ చరిత్ర, సంస్కృతి పరిరక్షణ, విద్యారంగ ప్రగతి.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థికి పాఠ్యాంశాలతో పాటు అవగాహన కలిస్తున్నామన్నారు. అనంతరం సంఘం లక్ష్యాలపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, వీవీజే సుబ్రహ్మణ్యం, కోశాధికారి తాతారావు పాల్గొన్నారు.

ఎస్‌ఐ తీరుపై విచారణకు ఆదేశం


ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఆంధ్ర ఎస్‌ఐ ఉల్లంఘించినట్లుగా వచ్చిన ఆరోపణలపై విచారణకు ఆదేశించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా, కొందరు రాజకీయ నాయకులను ఆంధ్ర ఎస్‌ఐ కె.సీతారాములు కలిసినట్లుగా ఆరోపణలు వచ్చాయని, దానిపై విచారణ చేసి నివేదిక అందివ్వాలని బొబ్బిలి డీఎస్పీ డి.భవ్యరెడ్డిని ఆదేశించామన్నారు. ఆరోపణలు రుజువైతే నిబంధనల మేరకు ఎస్‌ఐపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు.

రీసర్వే అలజడి..

- మండలానికో గ్రామంలో సిబ్బంది సర్వే
- సర్వేపై కూటమి ప్రభుత్వం యూటర్న్
- ఎన్నికలకు ముందు ఇదే సర్వేపై దుష్ప్రచారం
- ఇప్పుడు మళ్లీ అదే సర్వేకు ఆదేశాలు
- విస్మయం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


బొప్పడాం గ్రామంలో భూముల రీసర్వే సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దారు సుదర్శనరావు(ఫైల్)

నెల్లిమర్ల రూరల్:

భూముల సరిహద్దు వివాదాలు పరిష్కరించడంతో పాటు శాశ్వత హక్కులు కల్పించేందుకు గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూముల రీసర్వే ప్రారంభించిన విషయం తెలిసిందే. సరిగ్గా వందేళ్ల తర్వాత అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేపై ఆనాడు ప్రతిపక్షంలోని చంద్రబాబు అండ్ కో దుష్ప్రచారం చేయని రోజంటూ లేదు. అధునాతన సాంకేతికతతో సర్వే చేస్తున్న సమయంలోనే ప్రజలకు అడ్డగోలుగా ఐవీఆర్ఎస్ కాల్స్ చేసి, జగన్ మీ భూములు లాగేసుకుంటున్నారని విషం చిమ్మారు. ఆ తర్వాత వచ్చిన ఎన్నికల అనంతరం గద్దెనెక్కిన చంద్రబాబు భూముల రీసర్వేను రద్దు చేస్తున్నట్లు సంతకాలు కూడా చేశారు. ఇది జరిగిన రోజుల వ్యవధిలోనే భూముల రీసర్వేపై కూటమి ప్రభుత్వం యూటర్న్ తీసుకుంది. వాస్తవానికి నీతి అయోగ్ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేయాలని రాష్ట్రాలకు సూచించింది. ఈ మేరకు గత ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వేకు ప్రభుత్వం ప్రోత్సాహక నిధిని కూడా సమకూర్చింది. రీసర్వే చేస్తేనే కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రుణాలపై రైతులకు ఇచ్చే వడ్డీ రాయితీ విడుదల చేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు సర్కారు రీసర్వేకు రాక తప్పలేదు. దీంతో రైతు గుండెల్లో రీసర్వే కుంపటి పడినట్లయింది.

నాడు సర్వే రద్దు అన్నారు..

అప్పట్లో జగనన్న ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూముల రీసర్వేపై టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు జనసేన, బీజేపీ నాయకులు విషప్రచారం చేశారు. సర్వే చేస్తున్నది.. మీ భూములు లాగేసుకోవడానికేనని దుష్ప్రచారం చేసి, ప్రజలను నమ్మించారు. తమను గెలిపిస్తే అదే రీసర్వేను రద్దు చేసి, మీ భూములు కాపాడతామని యావత్తు ప్రజానీకాన్ని నమ్మబలికారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ అదే సర్వేను వారు ఆరంభించడంపై అటు ప్రజలు, ఇటు రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నెల్లిమర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఒక్కో గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా రీసర్వే చేస్తున్నారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే విషప్రచారం..

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం పేరుతో మొదటి విడత సమగ్ర భూముల రీసర్వేను గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించింది. మూడు దశల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. నెల్లిమర్ల నియోజకవర్గంలోని నెల్లిమర్ల, డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో పదుల సంఖ్యలో సర్వే బృందాలతో అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్లతో సర్వే చేపట్టారు. మొదటి విడతగా ప్రతీ మండలంలోని కొన్ని గ్రామాల్లో గత ప్రభుత్వం రీసర్వే పూర్తి చేసింది. సర్వే పూర్తయిన తర్వాత హద్దు రాళ్లను కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇదే సర్వేపై ఆనాడు ప్రతిపక్ష పార్టీలన్నీ తప్పుడు ప్రచారం చేసి, జనాన్ని భయభ్రాంతులకు గురిచేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అదే సర్వే చేస్తున్నా ఏ ఒక్క పార్టీ గానీ, ఏ ఒక్క రైతు గానీ నోరు మెదపడం లేదు. ఇప్పుడిప్పుడే ఆనాడు చంద్రబాబు రీసర్వేపై ఎన్ని అబద్ధాలు చెప్పారో జనం అర్థం చేసుకుంటున్నారు.

అప్పట్లో సదుద్దేశ్యంతోనే..

రైతులు ఎన్నోఏళ్లుగా భూ సమస్యలు ఎదుర్కొంటున్నారు. భూమి ఒకరిదైతే మరొకరి పేరున రికార్డులో ఆ భూమి నమోదు కావడం, సర్వే నంబర్లలో తప్పులు, సరిహద్దుల సమస్యలు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికావడం వంటి సమస్యలు అనేకం ఉన్నాయి. ఆయా సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించాలనే సదుద్దేశ్యంతోనే గతంలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సమగ్ర భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టింది. అంతకుముందున్న ఏ ప్రభుత్వమూ ఇటువంటి మహోన్నతమైన కార్యక్రమానికి ఆలోచన చేయలేదు.

అప్పుడు మంచిది కాదని ఇప్పుడెలా చేస్తారు?



ఎన్నో ఏళ్లుగా భూ సమస్యలతో సతమతమవుతున్న రైతులకు గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించిన భూముల రీసర్వే ఓ భరోసానిస్తోందన్న సమయంలో ఆనాడు చంద్రబాబు దుష్ప్రచారం చేశారు. నమ్మిన అన్నదాతలు కూడా సర్వే చేస్తుంటే భయపడ్డారు. ఇప్పుడు అదే సర్వేను చంద్రబాబు సర్కారు ఎలా ప్రారంభిస్తుంది. అప్పుడు మంచిది కాదని, ఇప్పుడు ఎలా చేస్తారు.

–సారిక వైకుంఠంనాయుడు, వైస్ ఎంపీపీ, నెల్లిమర్ల

800 ఎకరాల్లో రీసర్వే..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూముల రీసర్వేకు నెల్లిమర్ల మండలంలోని బొప్పడాం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశాం. ప్రస్తుతం ఈ గ్రామంలో నాలుగు సర్వే బృందాలతో సుమారు 800 ఎకరాల్లో రీసర్వే కొనసాగుతోంది. ఇప్పటివరకు 40 ఎకరాల్లో సర్వే పూర్తి చేశాం.

–సుదర్శనరావు, తహసీల్దారు, నెల్లిమర్ల మండలం

పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలి


ఎస్‌ఐ అశోక్‌కుమార్‌ను కలిసిన గుంకలం జగనన్న కాలనీవాసులు

విజయనగరం క్రైమ్: రాత్రి వేళల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని గుంకలం జగనన్న హౌసింగ్ కాలనీవాసులు కోరుతున్నారు. స్థానిక కాలనీలో ఆదివారం జరిగిన ఓ సమావేశానికి హాజరైన రూరల్ ఎస్‌ఐ వి.అశోక్‌కుమార్‌ను కాలనీవాసులు కలిసి ఇటీవల కాలంలో జరిగిన దొంగతనాలు, రాత్రి వేళల్లో ఎదురయ్యే సమస్యలను వివరించారు. మహిళా సంరక్షణ పోలీసుల సహకారంతో కాలనీలో సర్వే చేస్తామన్నారు. రాత్రి వేళల్లో హైవే పెట్రోలింగ్‌తో పాటు కాలనీకి ఓ ఏఎస్‌ఐ స్థాయి అధికారిని గస్తీ ఏర్పాటుకు నియమిస్తామని హామీ ఇచ్చారు. ఎప్పుడు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా తమకు సమాచారమివ్వాలన్నారు. గంజాయి సేవించిన వారిపైనా, అమ్మకాలు చేసే వారిపైనా దృష్టిపెట్టాలన్నారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారినపడకుండా చూడాలన్నారు. ఎల్‌హెచ్ఎంఎస్, సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్టులపై అవగాహన కల్పించారు. అనంతరం కాలనీవాసులు ఎస్‌ఐ అశోక్‌కుమార్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

• బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం నిరసన



కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఆదివారం నిరసనకు దిగారు. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎ.రమణమ్మ, ఎ.జగన్‌మోహన్‌రావులు పాల్గొని, బడ్జెట్ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై ప్రశ్నించారు. రాష్ట్ర విభజన హామీలు, ప్రత్యేక హోదా, రాజధానికి నిధులు, రైల్వే జోన్, విశాఖ ఉక్కు కర్మాగారం, దుగ్గిరాల పోర్టుల ప్రస్తావనే బడ్జెట్‌లో లేదన్నారు. ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ, గిరిజన వర్సిటీలకు సైతం నిధులు కేటాయించలేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గత బడ్జెట్‌లో రూ.8,622 కోట్ల నిధులు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో రూ.3,295 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. రూ.11,440 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రస్తావన కూడా లేదన్నారు. రాష్ట్రానికి రావాల్సిన జీఎస్టీ కేటాయింపులు కూడా సరిగా లేవని, ఇలాంటి బడ్జెట్‌ను గొప్ప బడ్జెట్ అని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లు ప్రశంసించడం రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం తాకట్టు పెట్టడమేనని దుయ్యబట్టారు. ఇప్పటికైనా బడ్జెట్‌లో ఏపీకి జరిగిన ద్రోహంపై అఖిలపక్ష వేసి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నగర కమిటీ సభ్యులు బి.రమణ, వి.రామచంద్రరావు, వి.లక్ష్మి, డి.రాము తదితరులు పాల్గొన్నారు.

–విజయనగరం ఫూల్‌బాగ్

శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శ్రీకారం


శ్మశానవాటిక అభివృద్ధి పనులు చేయిస్తున్న యువత

సాక్షి ఎఫెక్ట్

పూసపాటిరేగ: ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న పూసపాటిరేగలోని భూడి వీధి, యాతపేట, శాలిపేటల శ్మశానవాటిక అభివృద్ధి పనులకు గ్రామస్తులే ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. శ్మశానం అధ్వానంగా ఉన్న పరిస్థితులపై జనవరి 21వ తేదీన సాక్షి దినపత్రికలో 'అంతిమ సంస్కారాలకూ అవస్థలే' అనే శీర్షిక పేరిట వార్తా కథనం ప్రచురించింది. స్పందించిన గ్రామ యువత అనుకున్నదే తడవుగా శ్మశానాన్ని బాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. జేసీబీ సాయంతో పెద్దచెరువు గట్టు మట్టిలోడులు 300 వరకు శ్మశానంలో అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నారు. కార్యక్రమంలో యువకుడు మహంతి శివ, తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం

పూసపాటిరేగ: భోగాపురం మండలంలోని ఉప్పాడపేట జీడితోటలో ఆదివారం కొండచిలువ సంచరిస్తూ కలకలం రేపింది. అటువైపుగా వెళ్తున్న స్థానికులు భయాందోళనతో దానిని కొట్టి చంపేశారు. దాదాపు 10 అడుగుల పొడవు ఆ పాము ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి


రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన హోర్డింగ్ వద్ద ఎస్‌ఐ సన్యాసినాయుడు తదితరులు

డెంకాడ: ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు సూచించారు. మండలంలోని పలు ప్రధాన రహదారుల కూడళ్లలో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను తెలిపే హోర్డింగ్‌లను ఆదివారం ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవడం తప్పనిసరి అని ఆయన తెలిపారు. అలాగే మితిమీరిన వేగంతో వాహనాలు నడపవద్దని, పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లోకి ఎక్కించవద్దని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు.

• ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



విజయనగరంలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 5 గంటలకు డప్పు శ్రీను కళాబృందం వారు చేసిన జానపద నృత్యాలు, గీతాలాపనలు అలరించాయి. అనంతరం పలువురు కళాకారులు ప్రదర్శించిన కామెడీ స్కిట్ చూపరులను కట్టిపడేసింది. కార్యక్రమం ముగిసిన తర్వాత కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో శిల్పారామం అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఉప్పాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

–విజయనగరం టౌన్

సమగ్ర సస్యరక్షణే కీలకం

- ఆశాజనకంగా అపరాల సాగు
- యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది


ఎల్.కోట మండలం ఖాసాపేట సమీపంలో పెసర పంటపై పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు


ఎల్.కోట మండలం గొల్జాంలో ఆశాజనకంగా ఉన్న పెసర పంట


కొత్తవలస మండలం దెందేరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మాధురీశరణ్య (ఫైల్)

ఎస్.కోట నియోజకవర్గంలో అపరాల సాగు వివరాలు హెక్టార్లలో...

మండలం	పెసర	మినప
ఎల్.కోట	720	880
ఎస్.కోట	691	722
వేపాడ	648	722
కొత్తవలస	42	286
జామి	943	1286

కొత్తవలస: ఎస్.కోట నియోజకవర్గంలో అపరాల సాగు ఆశాజనకంగా ఉంది. ఖరీఫ్ వరి నాట్లు వేసిన పొలాల్లో పంట కోతకు ముందు రైతులు పెసర, మినప విత్తనాలు చల్లారు. అయితే మొక్కలు ప్రారంభ దశలో ఉన్నప్పుడు కురిసిన వర్షాలు అక్కడక్కడా పంటకు నష్టం చేశాయి. ప్రస్తుతం పంటకు అనుకూల వాతావరణం ఉందని సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కొత్తవలస సబ్‌డివిజనల్ వ్యవసాయాధికారి ఎల్.విజయ సూచిస్తున్నారు. ప్రస్తుతం పైరుకు కొన్నిరకాల చీడపీడలు సోకుతున్నాయని, రైతులు వీటిని సకాలంలో గుర్తించి వ్యవసాయ సిబ్బంది సలహాల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెబుతున్నారు. గత 15 రోజులుగా దట్టంగా మంచు కురుస్తుండడం వల్ల పైరును థ్రిప్ అనే పురుగు ఆశించే అవకాశం ఉందని, ఈ పురుగు పూతను తినేస్తుందని, నివారించకుంటే నష్టం తప్పదని అంటున్నారు. నివారణకు లీటరు నీటిలో 2 మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ మందును కలిపి, ఎకరాని 400 మిల్లీలీటర్ల మందును పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. ముందుగా పంట వేసిన చోట చేనులో కాయతొలచు పురుగు అధికంగా ఉంటుందని, నివారణ కు లీటరు నీటిలో 2.5 మిల్లీలీటర్ల క్లోరోపైరిఫాస్ మందును కలిపి ఎకరానికి అరలీటర్ మందు పిచికారీ చేసుకోవాలని వివరించారు. గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో అపరాల పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇంకో వారం,పది రోజుల పాటువాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

శతశాతం ఫలితాలు సాధించాలి

- జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పెంటోజీరావు


విద్యార్థులకు సూచనలిస్తున్న జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పెంటోజీరావు

నెల్లిమర్ల రూరల్: పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించాలని, ఆ దిశగా సిబ్బంది, విద్యార్థులంతా కృషి చేయాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పెంటోజీరావు సూచించారు. మండలంలోని మొయిద విజయరామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13 బీసీ బాల,బాలికల వసతి గృహాలకు చెందిన 100 మంది విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రేరణ, పునశ్చరణ తరగతులను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున చక్కని ప్రణాళిక వేసుకుని బాగా చదవాలని విద్యార్థులకు తెలిపారు. ఒత్తిడి లేని చదువు శ్రేయస్కరమని, ఆ దిశగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సంక్షేమ అధికారులు రాజులమ్మ, యశోదనరావు, కృష్ణవేణి, కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీడీఎస్ బియ్యం వేలం

చీపురుపల్లి: స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో గల మండలాల్లో 6–ఏ కేసుల్లో సీజ్‌చేసిన 52.958 మెట్రిక్ టన్నుల రేషన్(పీడీఎస్) బియ్యంను సోమ వారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ ఎస్.రాజారావు ఆదివారం ఓ ప్రకటన లో తెలిపారు. బియ్యం వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఉదయం 10.30 గంటలకు వేలం ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.